# నూతన గనులను సాధించుకోవాలి

### కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి




హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): వచ్చే రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వరంగ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తం కావాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు అందుబాటులోకి తీసుకురావచ్చని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి కోలిండియా, సింగరేణి ఉన్నతాధికారులు హాజరయ్యారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సమీక్షలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంపెనీ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతిని మెరుగుపరచాలని కోరారు.

**రహస్య పత్రాలను లీక్‌చేస్తే కఠిన చర్యలు**

సింగరేణి సంస్థకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బయటకు లీక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్) హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్ జారీచేశారు. కంపెనీ రహస్య పత్రాలు తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు ఉద్యోగులను, అధికారులను బెదిరిస్తున్నట్టు, ఒత్తిడికి గురిచేస్తున్నట్టు తెలుస్తున్నదని, అలాంటి వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా లెక్క చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

# బ్యాంకింగ్ మోసాలు 36 వేల కోట్లు

### 2024-25లో తగ్గిన ఫ్రాడ్.. నష్టాలు మూడింతలు

### రిజర్వుబ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి



ముంబై, మే 29: బ్యాంకింగ్‌లో మోసాలను నియంత్రించడానికి రిజర్వు బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. రుణ ఖాతాలు, డిజిటల్ చెల్లింపులకు సంబంధించి సంఖ్య పరంగా తగ్గినప్పటికి విలువ పరంగా చూస్తే మాత్రం మూడింతలు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన తన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.36,014 కోట్ల విలువైన మోసాలు జరిగాయని తెలిపింది. అంతక్రితం ఏడాది రూ.12,230 కోట్ల మోసాలు జరిగాయి. సంఖ్యాపరంగా చూస్తే మాత్రం 2023-24లో 36,060 మోసాలు జరగగా, ఆ తర్వాతి ఏడాదికిగాను 23,953కి తగ్గాయి. ప్రధానంగా 122 కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు గడిచిన ఆర్థిక సంవత్సరంలో వర్గీకరించడం వల్లనే విలువ భారీగా పెరిగిందని తెలిపింది. బ్యాంకింగ్ మోసాల్లో డిజిటల్ పేమెంట్లు, కార్డు, ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా ఉన్నాయని పేర్కొంది. మొత్తం మోసాల్లో 60 శాతం మోసాలు ప్రైవేట్ రంగ బ్యాంకుల్లోనే జరిగాయని తెలిపింది. మొత్తం విలువల్లో వీటి వాటా 71 శాతంగా ఉన్నది. కార్డు/ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా 13,516గా నమోదయ్యాయి. మొత్తం 23,956 మోసాల్లో వీటి వాటా 56.5 శాతంగా ఉన్నది. లక్ష రూపాయల కంటే అధికంగా నమోదైన మోసాల గురించి ఆర్బీఐ వివరించింది.

**25% పెరిగిన కరెన్సీ ప్రింటింగ్ ఖర్చులు**

కరెన్సీ ప్రింటింగ్ కోసం పెట్టే రిజర్వు బ్యాంక్ గరిష్ఠ స్థాయిలో ఖర్చు చేస్తున్నది. గతేడాదికిగాను కరెన్సీల ప్రింటింగ్ కోసం రూ.6,372.8 కోట్ల నిధులను ఖర్చు చేసింది. అంతక్రితం ఏడాది ఖర్చు చేసిన రూ.5,101.4 కోట్లతో పోలిస్తే 25 శాతం పెరిగినట్టు తన వార్షిక నివేదికలో వెల్లడించింది. నోట్లు సంఖ్య ఆరు శాతం అధికం కాగా, విలువ పరంగా చూస్తే 5.6 శాతం పెరిగాయి. కరెన్సీ ప్రింటింగ్‌లో రూ.500 నోట్ 86 శాతం వాటా కలిగివున్నది. క్రితం ఏడాదితో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. అలాగే రూ.10 డినామినేషన్ బ్యాంక్ నోట్ వాటా 16.4 శాతంగా ఉన్నది. మొత్తం బ్యాంక్ నోట్ల సర్క్యులేషన్‌లో రూ.10, రూ.20, రూ.50 మొత్తంగా 31.7 శాతం వాటా కలిగివున్నది. రెండేండ్ల క్రితం రద్దు చేసిన రూ.2 వేల నోట్లలో ఇప్పటి వరకు 98.2 శాతం నోట్లు బ్యాంకుల వద్ద జమ అయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.2, 5, 10, 20, 50, 100, 200, 500 నోట్లు చలామణిలో ఉన్నాయి.

**బ్యాలెన్స్ షీట్ పెరుగుదల**

రిజర్వు బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ ఏడాది ప్రాతిపదికన 8.20 శాతం ఎగబాకి రూ.76.25 లక్షల కోట్లకు చేరుకున్నది. నగదు నిల్వలు అత్యధికంగా ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్..కేంద్ర ప్రభుత్వానికి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. పసిడి ఆస్తులు 52.09 శాతం అధికమవగా, దేశీయ పెట్టుబడులు 14.32 శాతం, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్లు 1.70 శాతం అధికమయ్యాయి.



**పసిడి నిల్వలు హైజంప్**

రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న పసిడి నిల్వలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో పసిడి విలువ ఏడాది ప్రాతిపదికన 57.12 శాతం ఎగబాకి రూ.4,31,624.8 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతోపాటు ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే విలువ పెరిగిందని వెల్లడించింది. మార్చి 31, 2024 నాటికి గోల్డ్ రిజర్వులు రూ.2,74,714.27 కోట్లుగా ఉన్నది.


**ఆర్బీఐ నివేదికలో కీలక అంశాలు..**

- ముక్కలు చేసిన నోట్లతో కణ బోర్డులను తయారు చేస్తున్నారు.
- డిజిటల్ కరెన్సీ లావాదేవీలు రూ.1,016 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది రూ.234 కోట్లుగా ఉన్నాయి.
- ప్రస్తుతం రిజర్వుబ్యాంక్ వద్ద 879.58 మెట్రిక్ టన్నుల విలువైన గోల్డ్ రిజర్వులు ఉన్నాయి. అంతక్రితం ఏడాది 822.10 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.
- 311.38 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి ఆస్తులు కలిగివుండగా, మిగతా 568.20 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నది.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల విలువైన పసిడిని కొనుగోలు చేసింది.

# చివరి అరగంటలో కొనుగోళ్లు

### 320 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, మే 29: స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుపై అక్కడి కోర్టు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో దేశీయ సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఉదయం నుంచి తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరి అరగంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో భారీగా లాభపడ్డాయి. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 320.70 పాయింట్లు అందుకొని 81,633.02 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 81.15 పాయింట్లు అందుకొని 24,833.60 వద్ద స్థిరపడింది. ప్రస్తుత నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా మెటల్, రియల్టీ, ఫార్మా, ఐటీ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాజీ సీఈవో సుమంత్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిషేధం విధించడంతో ఈ బ్యాంక్ షేరు భారీగా లాభపడింది. ఇంట్రాడేలో 3 శాతానికి పైగా లాభపడిన బ్యాంక్ షేరు చివరకు 2.41 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్‌లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్ మాత్రం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ 1.21 శాతం అధికమవగా, మెటల్, ఐటీ, సర్వీసెస్, టెక్నాలజీ, కమోడిటీస్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..ఎఫ్‌ఎంసీజీ రంగ షేరు నష్టపోయింది.



## అమర రాజా రూ.5.20 డివిడెండ్

హైదరాబాద్, మే 29: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.2,974 కోట్ల ఆదాయంపై రూ.224 కోట్ల పన్నులు చెల్లించకముందు నికర లాభాన్ని గడించింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.12,405 కోట్ల ఆదాయంపై రూ.1,299 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. దీంతోపాటు ప్రతిషేరుకు రూ.5.20 డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

## పోకర్ణ లాభం మూడింతలు

హైదరాబాద్, మే 29: గ్రానైట్ తయారీ సంస్థ పోకర్ణ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.రూ.58.90 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది నమోదైన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. అలాగే ఆదా యం ఏడాది ప్రాతిదదిన 62.50 శాతం ఎగబాకి రూ.262.68 కోట్లుగా నమోదైంది. 2024-25కిగాను రూ.930.10 కోట్ల ఆదాయంపై రూ.187.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

# పసిడి కొనుగోళ్లకు ధరల షాక్

### 2025-26లో 10 శాతం వరకు తగ్గనున్న డిమాండ్: ఇక్రా నివేదికలో వెల్లడి



ముంబై, మే 29: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల కారణంగా బంగారు ఆభరణాల వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల వినిమయం 9 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారం ధరలు 33 శాతం పెరగడం ఇందుకు కారణమని తెలిపింది. 2024-25లో కడ్డీల వినిమయం 17 శాతం, నాణేలు 25 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్లాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ జితిన్ మక్కర్ తెలిపారు. ఈ ఏడాది కడ్డీలు, నాణేల డిమాండ్ 10 శాతం మించే అవకాశాలు లేదని ఆయన స్పష్టంచేశారు. రిటైల్ విస్తరణ, అసంఘటిత విభాగం అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదంటున్న ఆయన.. పెరుగుతున్న ధరల కారణంగా వినియోగం తగ్గుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో డిమాండ్ తగ్గే అవకాశాలు లేవని స్పష్టంచేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారు ఆభరణాల వినిమయం విలువలో గణనీయమైన 28 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది కూడా ఇదే తరహా పెరుగుదల ఉంటుందని పేర్కొంది.

**ధరలు పెరిగే అవకాశాలు తక్కువే..**

ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు ఈ ఏడాది ఇదే స్థాయిలో కొనసాగే అవకాశాలున్నాయని ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా ఏదైనా అనిశ్చిత పరిస్థితులు నెలకొంటే తప్ప ధరల్లో పెద్దగా మార్పులు ఉండవని తెలిపింది.

**రూ.500 తగ్గిన తులం ధర**

గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.500 దిగొచ్చింది. దీంతో పదిగ్రాముల విలువ రూ.99 వేల దిగువకు రూ.98,500కి పడిపోయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే స్థాయిలో తగ్గి రూ.98 వేలుగా నమోదైంది. కానీ, వెండి ధరలు యథాతథంగా ఉన్నాయి. కిలో వెండి రూ.1,00,000గా ఉన్నది.



ధర రూ.88,942

## నయా జుపిటర్

న్యూఢిల్లీ, మే 29: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..దేశీయ మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ చేసిన నయా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూపిటర్ 125 డ్యూయల్ టోన్ స్మార్ట్‌కనెక్ట్‌ని పరిచయం చేసింది. ఈ స్కూటర్ ధర రూ.88,942గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

**జావా యెజ్డీ షోరూం**

జావా యెజ్డీ.. తాజాగా హైదరాబాద్‌లో మరో షోరూంను తెరిచింది. కంపెనీకి చెందిన వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే మరో షోరూంను ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## డీజీపీని కలిసిన సీపీ



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

వినాయక్‌నగర్, మే 29: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్‌ను నిజామాబాద్ సీపీ సాయిచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డికి గురువారం వచ్చిన డీజీపీని కలిసిన సీపీ.. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

రుద్రూర్, మే 29:నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సాయన్న దుకాణాదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో.. రైతులు విత్తనాలు, ఎరువులను లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చించారు.

## గాయపడిన వ్యక్తి మృతి

శక్కర్‌నగర్, మే 29: బోధన్ పట్టణంలోని అనీల్ టాకీస్ రోడ్డులో ఎదురెదురుగా వెళ్తున్న రెండుబైక్‌లు ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోస్రా మండలం 6వ నంబర్ తండాకు చెందిన రుడావత్ ఉత్తం (40) ఈనెల 28న ఉదయం బోధన్‌కు తన బైక్‌పై వెళ్తున్నాడు. అనీల్ టాకీస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఉత్తం తలకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, అనంతరం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

## చెరువులో పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, మే29: ప్రమాదవశాత్తు కాలు జారి పట్టణంలో మల్లె చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ధోండి గంగాప్రసాద్ మల్లె చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. గంగా ప్రసాద్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

రెంజల్, మే 29: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్ (42) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చంద్రమోహన్ కథనం మేరకు.. బోర్గాం గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్ మద్యానికి బానిసగా మారి తరుచూ భార్యతో గొడవ పడేవాడు. ఈనెల 24న భార్యతో గొడవపడగా ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన లక్ష్మణ్ ఈనెల 28న రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం 10 గంటల వరకు గదినుంచి లక్ష్మణ్ బయటికి రాకపోవడంతో అతని తల్లి మేకల పోసాని వెళ్లి చూసి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఏకో టూరిజం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం

- పర్యాటక కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర అడిషనల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సునీత భగవత్

నందిపేట్/బాల్కొండ, మే 29: డొంకేశ్వర్ మండలం గాదేపల్లి, చిన్న యానం శివారులోని ఎస్సారెస్పీ, గోదావరి పరివాహక ప్రాంతాన్ని గురువారం రాష్ట్ర అడిషనల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సునీత భగవత్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఏకో టూరిజం ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖత వ్యక్త చేయడంతో ఇదివరకే సంబంధిత అధికారులు ఇక్కటికి వచ్చి పరిశీలించారు. ఏకో టూరిజం ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు కలిగే ప్రయోజనాలతోపాటు ఇతర అంశాలను పరిశీలించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ శివారులో శ్రీరాం సాగర్ బ్యాక్ వాటర్ నిలిచే ఒడ్డున ఏకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చేపట్టాల్సిన స్థలాన్ని పరిశీలించారు. పులిగుట్ట వద్ద మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఏకో టూరిజం కేంద్రం కోసం కేటాయించారు. అక్కడ భవనాలు, గార్డెన్ ఇతర ఏర్పాట్లపై చర్చించారు. ఆమె వెంట ఏకో టూరిజం డైరెక్టర్ రంజిత్‌నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్‌మీనా, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఆర్మూర్ అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్, బాల్కొండ డిప్యూటీ రేంజ్ అధికారి రణవీర్, మెండోరా సెక్షన్ అధికారి గణేశ్,నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సునీత భగవత్

# రెండో రోజూ కొనసాగిన కేంద్ర బృందం పర్యటన

- ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- మాక్లూర్ పీహెచ్‌సీ తనిఖీ

నందిపేట్/మాక్లూర్/నవీపేట, మే 29: జిల్లాలోని పలు మండలాల్లో రెండో రోజు గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. నందిపేట్ మండలంలోని ఆంధ్ర నగర్ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐకేపీ, ఐసీడీఎస్, విద్యావైద్యం, వ్యవసాయ శాఖల పనితీరుపై గ్రామంలో ఇంటింటికీ తిరిగి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. వీరి వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో లక్ష్మీప్రసాద్ ఉన్నారు.

**మాక్లూర్ మండలంలో..**

మాక్లూర్ మండలంలోని మాదాపూర్, మాక్లూర్ గ్రామాల్లో నాలుగు శాఖలకు చెందిన కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. మాదాపూర్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యాన్ని పరిశీలించి డీలర్ సురేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో మాక్లూర్‌లో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీని, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీవో లక్ష్మారెడ్డి, గిర్దావార్ షఫీ, ఎపీవో ఓంకార్, ఏపీఎం అనిల్‌కుమార్, జీపీ కార్యదర్శులు రాకేశఖ, సురేశ్ ఉన్నారు.

**నవీపేట మండలంలో..**

నవీపేట మండలంలోని జన్నేపల్లి, అబ్బాపూర్(ఎం) గ్రామాల్లో రెండో రోజు కేంద్రం బృందం సభ్యులు సెంట్రల్ టీం సభ్యులు పూనమ్, గోయల్, మనీషా, మనిష్ పర్యటించారు. ఆయుష్మాన్ భారత్ కింద పేదలకు ఏ మేరకు వైద్య సేవలు అందుతున్నాయని ఇంటింటికీ తిరిగి తెలుసుకున్నారు. గర్భిణులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యులు సిల్ప, ఎంపీఎచ్‌వో సంతోష్, సూపర్‌వైజర్ కిషన్, ఏపీవో భూమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మాక్లూర్ పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

# పంటల మార్పిడితో భూమిలో సమృద్ధిగా పోషకాలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పొతంగల్, మే 29: ఒకే రకమైన పంటలను సాగు చేయడంతో పొలాల్లో భూసారంతోపాటు పంట దిగుబడి తగ్గుతుందని పంటల మార్పిడితో భూమిలో పోషకాలు వృద్ధి చెందుతాయని సస్యరక్షణ శాస్త్రవేత్త పి.విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని హెగ్డోలిలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అనుసంధానంతో రైతులకు రైతు ముం గిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకే రసాయనాల వినియోగం పై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, డాక్టర్ ఎం.శ్వేత, మండల వ్యవసాయ అధికారి నిశిత, పశువైద్య అధికారి సురేశ్ కుమార్, రైతులు నాగం సాయిలు, అర్జున్ రావు, సాయినాథ్, శివరాజ్, శంకర్, నాయకుడు పుప్పాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వర్ సమస్యతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రుద్రూర్, మే 29: రుద్రూర్‌లోని తహసీల్ కార్యాలయంలో సర్వర్ సమస్యతో గురువారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ విషయమై తహసీల్దార్ తారాబాయి మాట్లాడుతూ.. రెండు రోజులుగా సర్వర్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతున్నదని తెలిపారు.

## తాళం వేసిన ఇండ్లలో చోరీ

కామారెడ్డి, మే 29 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో కాసర్ల విహార్ ఫేస్-2లో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న నర్సాగౌడ్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఇంట్లో రూ.75 వేల విలువైన టీవిని ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. సీసీ పుటేజ్‌లో చోరీకి పాల్పడిన దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. దీనిపై పోలీసులను సంప్రదించగా బాధితుడు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

**బీర్కూర్‌లో..**

నస్రుల్లాబాద్, మే 29 : బీర్కూర్ మండలం కేంద్రం లోని గాంధీచౌక్ సమీపంలో ఉన్న బల్లెపు నాగమణి ఇంట్లో గురువారం చోరీ జరిగింది. నాగమణి మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్నది. వేసవి సెలవులు కావడంతో ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో ఉన్న తన తమ్ముడి ఇంటికి వెళ్లింది. గురువారం తిరిగి ఇంటికి చేరుకున్నది. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, అర తులం బంగారం, 12 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



కామారెడ్డిలో సీసీ కెమెరాలో నమోదైన దొంగ

## ఈ విద్యాసంవత్సరం నుంచే 'నవోదయ' తరగతులు

వినాయక్‌నగర్, మే 29: నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు రెండు నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి నవోదయ తరగతులు ప్రారంభించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాలయాలకు సంబంధించి శాశ్వత, తాత్కాలిక స్థలాలకు అవసరమైన చర్యలు చేపట్టాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణకు లేఖ రాసినట్లు తెలిపారు. నిజామాబాద్‌లో నాగారం శివారులోని డైట్ కాలేజీలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ శివారులో 30 ఎకరాల భూమిలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తాత్కాలిక భవన మరమ్మతుల కోసం రూ.20లక్షల ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## ఆవులు, దూడలను తరలిస్తే కఠిన చర్యలు


భిక్కనూరు, మే 29 : ఆవులు, దూడలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు. భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో పరిమితికి మించి, అనుమతి లేకుండా 11 లేగ దూడలను ఆదిలాబాద్ జిల్లా మార్కెట్‌లో కొ నుగోలు చేసి సంగారెడ్డి మార్కెట్‌లో విక్రయించడానికి తరలిస్తుండగా చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మహారాష్ట్రకు చెందిన వాహన డ్రైవర్ మహ్మద్ సమీర్, వాటిని కొనుగోలు చేసిన వసీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. 11 లేగ దూడలను సురక్షితమైన ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు.

## మాచాపూర్‌లో పేకాటరాయుళ్ల అరెస్ట్

### మూడు బైకులు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఎల్లారెడ్డి రూరల్, మే 29 : మండలంలోని మాచాపూర్ గ్రామ శివారులో గురువారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై మహేశ్ తెలిపారు. మాచాపూర్ గ్రామ శివారులో ఉన్న పామాయిల్ తోటలోని ఫాంహౌస్‌లో పేకాడుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడిచేశామన్నారు. ఆ సమయంలో అక్కడ పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నామని చెప్పారు. వారి నుంచి రూ.7,400 నగదు, మూడు బైకులు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## బాలిక అదృశ్యం



హారతి

వినాయక్‌నగర్, మే 29: రైల్వేస్టేషన్ నుంచి తమ కూతురు కనిపించకుండా పోయిందని తల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన కామ్రే పూజ తన ఐదుగురు పిల్లలతో కలిసి నిజామాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పనిచేయడానికి వచ్చింది. బుధవారం రాత్రి 11గంటలకు నాందేడ్ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది. అందరూ కలిసి రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై పడుకున్నారు. గురువారం ఉదయం ఐదు గంటలకు లేచిచూడగా పెద్దకూతురు హారతి కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై తెలిపారు. సమాచారం తెలిసిన వారు 87126 58591 నంబర్‌లో తెలియజేయాలని సూచించారు.

## ఎస్సారెస్పీలోకి 3310 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, మే 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి స్వల్పంగా వరద వచ్చి చేరుతున్నది. గురువారం ప్రాజెక్ట్‌లోకి 3310 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062 అడుగులు (12.556టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 321 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.